క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



మొగలికుదురులో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ అరుణకుమారి

మామిడికుదురు: మొగలికుదురు గ్రామ పరిధిలోని జగ్గన్నపేట దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీచౌడేశ్వరి సేవా సమితిచే సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని సర్పంచ్ కడి అరుణకుమారి ప్రారంభించారు. ప్రతి ఏడాది వేసవిలో దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామని సంఘం అధ్యక్షుడు యక్కల మెహర్‌బాబా తెలిపారు. కార్యక్రమంలో కడి శ్రీను, జాన పాలాక్షుడు, మానెం కమలేశ్వరరావు, చింతా చిన్న, కూర్మా శంకర్, బిళ్ల సుబ్బారావు, కామిశెట్టి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

27 మంది వలంటీర్ల రాజీనామా



మామిడికుదురులో రాజీనామా లేఖలను ప్రదర్శిస్తున్న వలంటీర్లు

మామిడికుదురు: గోగన్నమఠం గ్రామానికి చెందిన 27 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రదర్శించారు. గ్రామంలో పని చేస్తున్న మొత్తం వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేసి ఎంపీడీవోకు సమర్పించారు. రాజోలు అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు, ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావుకు మద్దతుగా ఎన్నికల్లో ప్రచారం చేస్తామని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పదే పదే తమ వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే విధంగా మాట్లాడుతూ తమ ఆత్మాభిమానాన్ని దెబ్బ తీస్తున్నారని వాపోయారు.

14 మంది వలంటీర్లు రాజీనామా

అయినవిల్లి: మండలంలోని కె.జగన్నాథపురానికి చెందిన 14 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఈ మేరకు స్థానిక పంచాయతీ కార్యదర్శికి, వైఎస్సార్ సీపీ కె.జగన్నాథపురం గ్రామశాఖ అధ్యక్షుడు మేడిశెట్టి శ్రీనివాస్‌కు, గ్రామ సర్పంచ్ మేడిశెట్టి ఉషారాణికి రాజీనామా పత్రాలను అందజేశారు. తాము స్వచ్ఛందంగా వైఎస్సార్ సీపీ పార్టీ విజయం ఎన్నికల్లో పనిచేయడానికి తమ వలంటీర్ ఉద్యోగం అడ్డు వస్తుందనే నేపథ్యంతో రాజీనామా చేశామని వలంటీర్లు తెలిపారు. మరలా సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే రావాలని నినదించారు.

ప్రపంచ ధరిత్రి దినోత్సవం



సఖినేటిపల్లిలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో నిర్వహిస్తున్న ర్యాలీ

సఖినేటిపల్లి: ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించే పర్యావరణ దినోత్సవమే ప్రపంచ ధరిత్రి దినోత్సవమని ఏపీ ఎన్జీసీ స్టేట్ మానిటరింగ్ ఆఫీసర్ జి.ప్రభావతి అన్నారు. సోమవారం సఖినేటిపల్లిలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి ప్రపంచ ధరిత్రి దినోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించారు. భూమిని కాపాడుకుందాం, పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం, చెట్లను నాటుదాం, ప్లాస్టిక్ వ్యర్థాలను నిషేధిద్దాం అంటూ నినాదాలతో ఈ ర్యాలీ చేశారు. విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేశారు.

భారీ జన సమూహంతో నామినేషన్

- నాలుగు మండలాల నుంచి తరలివచ్చిన పార్టీ శ్రేణులు, అభిమానులు
- రావులపాలెం నుంచి కొత్తపేట వరకూ భారీ ర్యాలీ చేసిన జగ్గిరెడ్డి



కొత్తపేటలో విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి



రావులపాలెంలో జగ్గిరెడ్డికి క్రేన్ సాయంతో భారీ గజమాల వేస్తున్న అభిమానులు

కొత్తపేట/రావులపాలెం: కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా చిర్ల జగ్గిరెడ్డి సోమవారం భారీ జన సమూహంతో ర్యాలీగా చేరుకుని నామినేషన్ దాఖలు చేశారు. నియోజకవ్యాప్తంగా పార్టీ శ్రేణులు అభిమానులు వేలాదిగా తరలిరావడంతో రావులపాలెం – కొత్తపేట రహదారి, కొత్తపేట రోడ్లన్నీ జనసంద్రంగా మారాయి. కొత్తపేట డివిజనల్ రెవెన్యూ కార్యాలయంలో ఆర్డీఓ, అసెంబ్లీ ఎన్నికల అధికారి జీవీవీ సత్యనారాయణకు నామినేషన్ సమర్పించారు.

అట్టహాసంగా నామినేషన్ కార్యక్రమాలు

తొలుత ఎమ్మెల్యే జగ్గిరెడ్డి గోపాలపురంలోని తన స్వగృహంలో తల్లిదండ్రులు రాధాదేవి–సోమసుందరరెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం సర్వమత ప్రార్థనలు, ఆయా గురువుల ఆశీర్వచనం తీసుకుని, ఉదయం 10.47 గంటలకు నామినేషన్ పత్రాలపై సంతకాలు చేశారు. అనంతరం తన కుమార్తె శ్రీనిధి, మూడో సోదరి గుడిమెట్ల సరోజ ఎదురు రాగా ఆయన ఇంటి నుంచి నిరాడంబరంగా బయలుదేరారు. రావులపాలెం కళా వెంకట్రావు సెంటర్‌లో అభయాంజనేయస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అదే సెంటర్‌లో పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికే అక్కడి చేరుకున్న నాలుగు మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు చేరుకున్నారు. వారి మధ్య జగ్గిరెడ్డి యూత్ సభ్యులు, అభిమానులు కోనసీమ ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన మహా భారీ గజమాలను క్రేన్ సాయంతో జగ్గిరెడ్డికి వేయగా ఆ గజమాల మధ్య ఆయన ప్రజలకు అభివాదం చేశారు.

వాహనాలతో భారీ ర్యాలీ

రావులపాలెం సెంటరు నుంచి కొత్తపేట షిరిడీ సాయిబాబా ఆలయం వరకూ వేలాదిగా బైక్‌లు, ఆటోలు, కార్లలో వచ్చి భారీ ర్యాలీగా చేరుకున్నారు. మధ్యలో కొమరాజులంక, పెంకులపాటి గరువు, మందపల్లి పెదవంతెన, ఏనుగులమహల్ సెంటర్లలో ఆయా గ్రామాల ప్రజలు అత్యధిక సంఖ్యలో పూలమాలలతో అఖండ స్వాగతం పలికారు. అనంతరం కొత్తపేట పాత బస్టాండ్ వద్ద రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి ఆర్డీఓ కార్యాలయం సమీపం 100 మీటర్లు వరకూ ర్యాలీ సాగింది. ఈ ర్యాలీలో అడుగడుగునా జై జగన్, జై జగ్గిరెడ్డి నినాదాలు మార్మోగగా స్థానికులు పూలమాలలతో, పూల వర్షం కురిపించి ఘన స్వాగతం పలికారు. దానికి ప్రతిగా జగ్గిరెడ్డి నమస్కరిస్తూ, అభివాదం చేస్తూ ముందుకు సాగారు.ఈ సందర్భంగా అభిమానులు భారీ ఎత్తున బాణసంచా పేల్చి జగ్గిరెడ్డిని నామినేషన్‌కు పంపారు. ఆయన అమలాపురం వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాద్, ప్రతిపాదకులు సత్యవరపు జమీందార్, మన్యం భాను, రెడ్డి చంటిలతో పాటు అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజుతో కలిసి వెళ్లి 3 సెట్ల నామినేషన్లను ఆర్డీవో, ఆర్‌ఓ జీవీవీ సత్యనారాయణకు దాఖలు చేశారు. జగ్గిరెడ్డితో పాటు ఆయన సతీమణి లావణ్య కూడా 2 సెట్ల నామినేషన్లు వేశారు. కార్యక్రమంలో నాలుగు మండలాల వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు అత్యధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

జగన్ రుణం తీర్చుకునేందుకు నామినేషన్

కొత్తపేట: గత ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు పొందిన ప్రజలు సీఎం రుణం తీర్చుకునేందుకు ప్రజలు తనతో కలిసి రాగా వేసిన ప్రజా నామినేషన్ అని సిట్టింగ్ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి అభివర్ణించారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్ సమర్పించిన అనంతరం జగ్గిరెడ్డి మీడియాతో మాట్లాడారు. ఈ నియోజకవర్గంలో ఆది నుంచి తమ కుటుంబానికి అన్ని వర్గాలు అండగా నిలవడం వల్లే రాజకీయాల్లో తద్వారా ప్రజా సేవలో పయనిస్తున్నామన్నారు. తనకు ఇది ఐదో ఎలక్షన్ అని, గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈసారి ప్రజా ప్రవాహం కనిపించిందన్నారు. ఇంత వేవ్ ఎప్పుడూ చూడలేదన్నారు. అన్ని వర్గాల ప్రజలు సీఎం జగన్ రుణం తీర్చుకుంటామంటూ, తనను అందరి వాడిగా భావించి తనతో వచ్చి, ఎదురేగి ఘనస్వాగతం పలికి ర్యాలీలో పాల్గొనడం చూస్తే చాలా ఆనందం కలిగిందన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా రాపాక వరప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాకు సంపూర్ణ మద్దతు ఇచ్చి స్వచ్ఛందంగా తరలివచ్చిన అశేష జనవాహినికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాద్, అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ సాకా మణికుమారి, రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నామినేషన్‌కు క్యాడర్

- జనసంద్రంలా పార్టీ శ్రేణులు
- రిటర్నింగ్ అధికారికి పత్రాలు అందజేత



రాజోలులో నామినేషన్ వేస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు



సఖినేటిపల్లిలంకలో గొల్లపల్లి నామినేషన్‌కు తరలి వెళుతున్న పార్టీ శ్రేణులు

రాజోలు: రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల నడుమ ఎంతో ఉత్సాహంగా భారీ ఊరేగింపుతో తరలి వచ్చారు. పార్టీ నాయకులు కేఎస్ఎన్ రాజు, జంపన బుజ్జిరాజు, మంగెన సింహాద్రి, గుబ్బల బాబ్జిలతో కలసి రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి గొల్లపల్లి వెళ్లారు. నామినేషన్ వేసేందుకు వెళుతున్నప్పుడు వైఎస్సార్ సీపీ పార్టీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు వెళుతున్నప్పుడు పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అభివాదం చేయడంతో జై జగన్.. జై గొల్లపల్లి నినాదాలు మార్మోగాయి.

తరలి వచ్చిన జనసంద్రం

గతంలో ఎన్నడూ చూడని విధంగా గొల్లపల్లి సూర్యారావు నామినేషన్ కార్యక్రమానికి నియోజకవర్గం నలుమూలల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. నామినేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత గొల్లపల్లి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ ప్రభంజనం కొనసాగుతోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు గెలుపు బాటకు మార్గాలుగా నిలిచాయన్నారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, పార్టీ నాయకులు రాపాక వెంకట్‌రామ్, గెద్దం తులసీభాస్కరరావు, దొమ్మేటి ఉమామహేశ్వరరావు, కలిగిత కుమార్, చెల్లుబోయిన రాంబాబు, కటకంశెట్టి ఆదిత్య, తెన్నేటి కిషోర్, అడబాల బ్రహ్మాజీ, కట్టా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మనస్సును కదిలించిన 'గొల్లపల్లి'పై అనురాగం

రాజోలులో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన గొల్లపల్లి సూర్యారావుపై తన కుటుంబ సభ్యులు ఆత్మీయ అనురాగం పలువురి మనస్సును కదిలించింది. సూర్యారావు తన రెండో కుమారుడైన ప్రసాద్ నడవలేని స్థితిలో అనారోగ్యంతో బాధపడుతూ తన తండ్రి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చారు. కారు నుంచి దిగలేని స్థితిలో ఉన్న తన కుమారుడు ప్రసాద్ వద్దకు సూర్యారావు వెళ్లగా తన తండ్రికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రసాద్ సతీమణి డాక్టర్ శోభ, కుమార్తె లోహిత నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే తన పెద్ద కుమారుడు గొల్లపల్లి శ్రీధర్‌ను సూర్యారావు ఆలింగనం చేసుకున్నారు. మనుమరాలు లోహితను తహసీల్దార్ కార్యాలయం వరకు తన వెంట గొల్లపల్లి తీసుకువెళ్లారు.

మలికిపురం నుంచి భారీ ర్యాలీ

మలికిపురం: రాజోలు వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా గొల్లపల్లి సూర్యారావు నామినేషన్‌కు భారీగా జనం తరలివచ్చారు. నియోజకవర్గం నలుమూలల నుంచి చేరుకున్న కార్యకర్తలతో మలికిపురం నుంచి ఉదయం 9.30 నిమిషాలకు ర్యాలీ బయలు దేరింది. వేలాదిగా తరలి వచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. మలికిపురం, విశ్వేశ్వరాయపురం, గుడిమెళ్లంక, మేడిచర్లపాలెం, శివకోడు మీదుగా రాజోలు వరకూ ర్యాలీ సాగింది. ఈ ర్యాలీతో నియోజకవర్గంలో పార్టీ విజయం ఖరారైందని గొల్లపల్లి అన్నారు. ఇదే ఉత్సాహంతో కార్యకర్తలంగా ముందుకు సాగి సీఎం జగన్‌ను ఎన్నుకోవాలని కోరారు. ఎంపీ అభ్యర్థి రాపాక వర ప్రసాదరావు మాట్లాడుతూ ఈ సారి రాజోలు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. నాయకులు బొంతు రాజేశ్వరరావు, జెడ్పీటీసీ బళ్ల ప్రసన్నకుమారి, ఎంపీపీ వీరా మల్లిబాబు, నల్లి డేవిడ్, మండల పార్టీ అధ్యక్షుడు అడబాల వీరబ్రహ్మాజీరావు తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లి నామినేషన్‌కు తరలి వెళ్లిన శ్రేణులు

సఖినేటిపల్లి: రాజోలు వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు సోమవారం రాజోలులో నామినేషన్ దాఖలు ఘట్టానికి మండల వ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులు రెట్టింపు ఉత్సాహంతో తరలి వెళ్లారు. ఆయా గ్రామాల నుంచి ఉదయం వారంతా మలికిపురంలోని పార్టీ కేంద్ర కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ నుంచి ర్యాలీగా రాజోలు వెళ్లారు. జై గొల్లపల్లి, జై రాపాక, జై బొంతు అంటూ పార్టీ జెండాలను చేతబూని, బైక్‌లపై నినాదాలు చేస్తూ కదం తొక్కారు. సఖినేటిపల్లిలంక నుంచి ఆ పార్టీ శ్రేణులు ముత్యాల నాని, చల్లా నాగరాజు, నడింపల్లి వెంకట సుబ్బరాజు, వాడపల్లి రాజబాబు తదితరులు తరలి వెళ్లిన వారిలో ఉన్నారు.

అంబులెన్స్ సిబ్బందికి ఫ్యాన్ బహూకరణ

పి.గన్నవరం: స్థానిక పాత పీహెచ్‌సీలో ఉంటున్న 108 అంబులెన్స్ సిబ్బందికి మమత స్వచ్ఛంద సేవాసమితి అధ్యక్షుడు కోరుకొండ జాన్ ఆధ్వర్యంలో సోమవారం స్టాండింగ్ ఫ్యాన్‌ను తహసీల్దార్ షేక్ హుస్సేన్ చేతుల మీదుగా బహూకరించారు. కార్యక్రమంలో సేవాసమితి నాయకులు నల్లా పెదకాపు, అడ్డగళ్ల నారాయణరావు, జిత్తుగ రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆలమూరు: నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం మండల కేంద్రమైన ఆలమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని రామచంద్రపురం ఈఈ వై.విజయానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా ఆలమూరు–2, జొన్నాడ, జిల్లెళ్లపేట, కలవచర్ల, పెనికేరు తదితర గ్రామాలకు సంబంధించి ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు వరకూ సరఫరా నిలిపివేయనున్నామన్నారు. వినియోగదారులందరూ విద్యుత్‌శాఖకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ట్రాన్స్‌కో ఏఈ వై.లక్ష్మి, లైన్ ఇన్‌స్పెక్టర్లు వాసంశెట్టి సత్యనారాయణ, కేవీవీ సుబ్రహ్మణ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సత్తెమ్మ విగ్రహ ప్రతిష్ఠ

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారం పెదపాలెంలో వెంచేసిన సత్తెమ్మ అమ్మవారి నూతన ఆలయ విగ్రహ యంత్ర ప్రతిష్ఠ మహోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ బాదంపూడి ప్రసాద్ శర్మ బ్రహ్మత్వంలో నరహరిశెట్టి శ్రీనివాసరావు, వరలక్ష్మి, నరహరిశెట్టి రామకృష్ణ, శ్రీవాణి దంపతుల ఆధ్వర్యంలో గణపతి పూజ, గవ్యాంతం గర్తన్యాసం, యంత్రస్థాపన జీవన్యాసం, మహాపూర్ణాహుతి, గోదర్శనం, మహాకుంభం, దివ్యదర్శనాలు జరిపించారు. గ్రామంలోని ఆడపడుచులు, భక్తులు అమ్మవారికి చలివిడి పానకాలు చెల్లించుకున్నారు. అనంతరం చంద్రమౌళి కామేశ్వర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నాలుగు నామినేషన్ల దాఖలు

పి.గన్నవరం: పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి సోమవారం నలుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. వైఎస్సార్ సీపీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా విప్పర్తి వేణుగోపాలరావు 2 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఆయనకు డమ్మీగా కుమారుడు విప్పర్తి రామ్మోహన్‌రావు నామినేషన్ వేశారు. అలాగే జనసేన పార్టీ అభ్యర్థిగా గిడ్డి సత్యనారాయణ, ఇండిపెండెంట్ అభ్యర్థిగా కొల్లాబత్తుల ఆనందరావు నామినేషన్లు వేశారు.

విజయవంతంగా విప్పర్తి నామినేషన్

- పి.గన్నవరం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా వేణుగోపాలరావు
- వేలాదిగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు



పి.గన్నవరంలో భారీ ఊరేగింపుతో నామినేషన్‌కు వెళ్తున్న విప్పర్తి వేణుగోపాల్



అంబాజీపేట సెంటర్ నుంచి ర్యాలీగా వెళుతున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

పి.గన్నవరం: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా విప్పర్తి వేణుగోపాలరావు సోమవారం పి.గన్నవరంలో విజయవంతంగా నామినేషన్ వేశారు. ఈసందర్భంగా జరిగిన ర్యాలీకి నియోజకవర్గం నలుమూలల నుంచి వేలాదిగా పార్టీ శ్రేణులు తరలిరావడంతో నియోజకవర్గ కేంద్రం కిక్కిరిసిపోయింది. తొలుత స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులు బాణసంచా కాల్చారు. కేరళ వాయిద్యాలతో సందడి చేశారు. అక్కడి నుంచి వేలాది కార్యకర్తల నడుమ విప్పర్తి మూడు రోడ్ల సెంటర్ వరకూ నడచి వెళ్లారు. అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అక్కడి నుంచి ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం సమీపం వరకూ ర్యాలీ జరిగింది. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పూలు చల్లి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈసందర్భంగా విప్పర్తి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అనంతరం ఆర్‌ఓ కార్యాలయంలో ఆయన తన నామినేషన్‌ను దాఖలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, నేలపూడి స్టాలిన్‌బాబు, మండల పార్టీ అధ్యక్షులు నక్కా వెంకటేశ్వరరావు, కొమ్ముల రాము, కుడుపూడి విద్యాసాగర్‌రావు, విత్తనాల శేఖర్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వర రావు, జెడ్పీటీసీలు, జిల్లా వాణిజ్య విభాగం నాయకుడు మంతెన రవిరాజు, కార్పొరేషన్ డైరెక్టర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. పి.గన్నవరం అభ్యర్థిగా నామినేషన్ వేసిన అనంతరం విప్పర్తి విలేకరులతో మాట్లాడారు. వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తల ఉత్సాహం చూస్తే విజయం ఎంతో దగ్గరగా ఉందనిపిస్తుందని అన్నారు. తనకు టిక్కెట్ ఇచ్చిన సీఎం జగన్‌కు, ర్యాలీలో పాల్గొన్న పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. తాను ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని, ఫ్యాన్ గుర్తుకు ఓట్లేసి తనను, ఎంపీ అభ్యర్థి రాపాకను గెలిపించాలని విప్పర్తి కోరారు.

అంబాజీపేట: పి.గన్నవరం నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న విప్పర్తి వేణుగోపాలరావును ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నేలపూడి స్టాలిన్‌బాబు, ఉభయ గోదావరి జిల్లాల గ్రీవెన్స్ కన్వీనర్ పేరి శ్రీనివాస్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్‌లు కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి వేస్తున్న విప్పర్తి వేణుగోపాలరావు సోమవారం నామినేషన్ వేస్తున్న సందర్భంగా పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా వెళ్లారు. తొలుత గంగలకుర్రు మలుపు శేఖర్ ఇంటి వద్ద నుండి భారీ మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహిస్తూ వేలాది మంది నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేణుగోపాలరావును భారీ మెజార్టీతో గెలిపించడానికి మండల ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలే గెలిపిస్తాయన్నారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా వెళ్లారు.

మామిడికుదురు: పి.గన్నవరం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు నామినేషన్ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు సోమవారం భారీగా తరలి వెళ్లారు. పి.గన్నవరం నియోజకవర్గంలోని 11 గ్రామాల నుంచి బైక్‌లతో పాశర్లపూడి నుంచి పాశర్లపూడిలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. నగరం గ్రామం నుంచి నీతిపూడి గణేష్ బాబు, నీతిపూడి గణపతిరావు ఆధ్వర్యంలో భారీగా కార్యకర్తలు పి.గన్నవరం తరలి వెళ్లారు. కార్యక్రమంలో పార్టీ నేతలు జేసీఎస్ ఇన్‌చార్జ్ జక్కంపూడి వాసు, తోరం సూర్యభాస్కర్, నెల్లి దుర్గాప్రసాద్, వాసంశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యార్థుల జోరు

- పదిలో కుమ్మేసిన విద్యార్థులు
- అభినందించిన హెచ్‌ఎంలు



ఆలమూరు మండలంలో ప్రథమంగా నిలిచిన విద్యార్థులు ఉమాసాయి శిరీష, లోహిత



అడబాల సూర్య నాగవేణి కీర్తన



గిడుగు శ్రీరామదుర్గ



కర్రి ధాత్రిజ



మట్టా మల్లీశ్వరి



వాకపల్లి భవ్యశ్రీ



ఎస్.నవనీత్



కొప్పిశెట్టి శిరీష

ఆలమూరు/మామిడికుదురు/మలికిపురం/రాజోలు/సఖినేటిపల్లి/ఆత్రేయపురం/అంబాజీపేట/కొత్తపేట/పి.గన్నవరం/అయినవిల్లి: పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు జోరు చూపించారని ఎంఈవోలు అన్నారు. మండలంలోని పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల్లో 87 శాతం ఉత్తీర్ణత సాధించారు. చెముడులంక జెడ్పీ హైస్కూల్‌లో 186 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 167 మంది ఉత్తీర్ణత సాధించారు. అందులో ఇద్దరికి మండల స్థాయిలో ప్రథమ, ఒకరికి ద్వితీయ స్థానాలు సాధించారు. ఇదే పాఠశాలలో 24 మందికి 500 మార్కులు దాటడం గమనార్హం. చెముడులంకలో ఎస్‌టీఎస్ ఎస్‌ఎం జెడ్పీ హైస్కూల్‌లో చోడపునీడి ఉమా సాయి శిరీష (577), తమ్మన లోహిత (577) సంయుక్తంగా మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచారు. అలాగే అదే పాఠశాలకు చెందిన సుంకర ఉమా పావని (576) మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది. ఆ విద్యార్థులను ఎంఈఓలు ఎస్‌వీ సుబ్బరాజు, పి.షాలెంరాజు, సర్పంచ్ తమ్మన శ్రీనివాసు, అధ్యాపక, సీఆర్‌పీలు అభినందించారు. మామిడికుదురు మండలంలోని పెదపట్నంలంక, మొగలికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు గిడుగు శ్రీరామదుర్గ, బొంతు హర్షిత 600 మార్కులకు 590 మార్కులు సాధించి మండల స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. మలికిపురం మండలం కేశనపల్లి యెనుముల బ్రహ్మానందం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని అడబాల సూర్య నాగవేణి కీర్తన 590 మార్కులతో మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. రాజోలు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన కర్రి ధాత్రిజ 578 మార్కులు సాధించి మండలంలో మొదటి స్థానంలో నిలిచింది. సఖినేటిపల్లి మండల స్థాయిలో సఖినేటిపల్లి గీతామందిరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని కోటిపల్లి నేహశ్రీ 579 మార్కులతో మండల ప్రథమ స్థానంలో నిలిచింది. ఆత్రేయపురం మండలంలోని అంకంపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి మట్టా మల్లేశ్వరి 564 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది. అంబాజీపేట మండలంలో వాకపల్లి భవ్యశ్రీ 567 (తొండవరం) ప్రథమ స్థానంలో నిలిచింది. కొత్తపేట మండలంలోని అవిడి చప్పిడివారిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.నవనీత్ 593 మార్కులతో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల స్థాయిలో ప్రథమ స్థానం సాధించాడు. పి.గన్నవరం జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి గిడుగు కావ్యశ్రీ మండల ప్రథమ స్థానం పొందారు. అయినవిల్లి మండలం కొండుకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన కొప్పిశెట్టి శిరీష 588 మార్కులు సాధించి మండల ఫస్ట్ సాధించింది.